నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 11 ఆగస్టు 2024 | HYDERABAD

ఓం గం గణపతయే నమో నమః

కోట్లాది మంది భక్తులకు కొంగుబంగారంగా నిలిచి ప్రతి ఏడాది భిన్నమైన రూపాలతో కనిపించే ఖైరతాబాద్ మహాగణపతి ఈ ఏడాది శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా దర్శనమివ్వనున్నాడు. 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో కనువిందు చేయనున్నాడు. వీటితో పాటు కుడివైపు పది అడుగుల అయోధ్య బాలరాముడు విగ్రహం, ఎడమ వైపు తొమ్మిది అడుగుల ఎత్తులో రాహు, కేతుల విగ్రహాలు, మూడు అడుగుల మూషికాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. కుడి వైపు 15 అడుగుల మండపంలో తొమ్మిది అడుగుల ఎత్తులో లక్ష్మి, శ్రీనివాసుడి విగ్రహాలు, ఎడమ వైపు మండపంలో అంతే ఎత్తులో పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. -ఖైరతాబాద్

'అన్ని రంగాల్లో టెక్నాలజీదే ముఖ్యపాత్ర'

శామీర్‌పేట : కృత్రిమ మేధ సాంకేతికత, చట్టం, న్యాయానికి మధ్య ఉన్న సంబంధాలపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్నదని నల్సార్ వీసీ కృష్ణదేవరావు అన్నారు. శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం లా కమిషన్ ఆఫ్ ఇండియా సహకారంతో కృత్రిమ మేధ, చట్టం, న్యాయం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో అన్ని రంగాల్లో సాంకేతికత ప్రముఖ పాత్ర పోషిస్తున్నదన్నారు. అందులో భాగంగా విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్న కృత్రిమ మేధకు చట్టం, న్యాయానికి ఉన్న సంబంధంపై అవగాహన అవసరమన్నారు. నాస్‌కామ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ బీవీ ఆర్ మోహన్‌రెడ్డి, లా కమిషన్ ఆఫ్ ఇండియా మెంబర్ సెక్రటరీ డాక్టర్ రీతావశిష్ట్ తదితరులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

టీజీఎయిమ్స్‌లో సమగ్ర సమాచారం

సిటీబ్యూరో, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): క్షేత్ర స్థాయిలో విద్యుత్ నెట్‌వర్క్‌ను పర్యవేక్షించేందుకు రూపొందించిన 11 కేవీ ఫీడర్ సర్వేతో మంచి ఫలితాలు సాధించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాచరణ రూపొందించింది. నిరంతరం నాణ్యమైన సరఫరాలో అత్యంత కీలకమైంది క్షేత్ర స్థాయి నెట్‌వర్క్. అందులో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత యంత్రాంగానిదే. ఈ విషయాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు.. సుమారు రెండు నెలల పాటు క్షేత్ర స్థాయిలోని ప్రతి ఫీడర్‌లో లైన్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి..'టీజీఎయిమ్స్' పేరుతో యాప్‌ను రూపొందించి..అందుబాటులోకి తెచ్చారు. విద్యుత్ ఉద్యోగులు మాత్రమే వినియోగించేలా రూపొందించిన ఈ యాప్‌లో సరఫరాకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. ఏ ఫీడర్ పరిధిలో సరఫరాకు అంతరాయం కలిగిందో కచ్చితంగా తెలుసుకొని.. అక్కడి సెక్షన్ ఎలక్ట్రిక్ అధికారులు..ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేసేలా ఆటోమేషన్ వ్యవస్థను రూపొందిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు.

పంట వైవిధ్యంతో భూసారం

సిటీబ్యూరో: ఏక కాలంలో పలు రకాల పంటలను ఒకేచోట సాగు చేస్తే.. భూసారం పెరుగుతుందని, దీంతో అధిక దిగుబడి, గ్రీన్‌హౌస్ వాయువులు, ఉద్గారాలు తగ్గుతాయని ఇక్రిశాట్‌తో పాటు పలు అగ్రీ రీసెర్చ్ ల్యాబ్‌లు చేసిన అధ్యయనంలో తేలింది. ఎనిమిదేండ్ల పాటు సుదీర్ఘకాలం చేసిన అధ్యయనంతో గ్రీన్‌హౌస్ వాయువుల తగ్గింపు, భూసారాన్ని పెంచడమే లక్ష్యంగా పరిశోధనలు చేయగా, ఒకేసారి రెండు, మూడు రకాల పంటలను సాగు చేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నట్లు తేల్చారు.

నకిలీ ఎస్సై, హోంగార్డు అరెస్టు

వెంగళరావునగర్: హోంగార్డుతో పాటు నకిలీ ఎస్సైని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. అన్నపూర్ణ స్టూడియోస్ గేట్ నం.1 ఎదురుగా ఉన్న పాన్‌షాప్ యజమానిని తాము టాస్క్ ఫోర్స్ పోలీసులమంటూ బెదిరింపులకు గురి చేశారు. 'మీ షాపులో గుట్కాలు అమ్ముతున్నారనే సమాచారం ఉందంటూ... కేసు పెట్టకుండా ఉండేందుకు రూ.5 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుమానం వచ్చి..వారిద్దర్నీ పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నిందితుల్లో ఒకరు సైబరాబాద్ ఎస్‌వోటీలో విధులు నిర్వహించే హోంగార్డు బాదుల్లాగా గుర్తించారు. అతడితో కలిసి వచ్చిన టాస్క్‌ఫోర్స్ నకిలీ ఎస్సై నరసారెడ్డిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎలివేటెడ్ ఏమాయే..!

- ఆర్నెల్లయినా అడుగుపడని 'ఎలివేటెడ్ కారిడార్లు'
- రక్షణ శాఖ అనుమతులు ఇచ్చినా.. ఎక్కడి గొంగళి అక్కడే
- ఇప్పటికీ పూర్తికాని ప్రాథమిక ప్రణాళిక
- టీఏల ఎంపిక టెండర్లకు స్పందన కరువు

అంతన్నారు.. ఇంతన్నారు..

ఇంత అన్నారు... *అంత అన్నారు... అంతలోనే ముంత బోర్లెసినట్లుగా ఉంది ఎలివేటెడ్ కారిడార్ల కథ. ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుకు తామే జీవం పోశామంటూ.. రక్షణ శాఖ భూముల ప్రక్రియ కూడా తమతోనే సాధ్యమైందంటూ గొప్పలు పోయారే తప్ప.. తట్టెడు మట్టిని ఇప్పటికీ తరలించలేదు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపనలతో చేసిన పనులు.. 'ఎలక్షన్ స్టంట్' అని తేలిపోయింది. దీంతో హైదరాబాద్‌కు తలమానికం కానున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ఆరు నెలలకు పైగా గడుస్తున్నా.. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పటికీ ఎప్పుడో మొదలుకావాల్సిన ప్రాజెక్టు...ప్రాథమిక దశను కూడా దాటలేకపోయింది. ఇక ట్రాన్సాక్షనల్ అడ్వైజర్ల పేరిట కాలం వెళ్లబీయాల్సిన పరిస్థితి నెలకొన్నది. అట్టహాసంగా భూమిపూజ చేసుకున్నా.. కాగితాలపైకి తీసుకురావడంలో సర్కారు విఫలమైంది.*

- సిటీబ్యూరో, ఆగస్టు 10(నమస్తే తెలంగాణ)

హైదరాబాద్ నగరానికి ప్రతిష్టాత్మకమైన రెండు ఎలివేటెడ్ కారిడార్ల ప్రాజెక్టులు కాగితాల మీదకు కూడా తీసుకురాలేదు. ఓ వైపు రక్షణ శాఖ నుంచి తీసుకున్న భూములకు పరిహారం.. ఇతర ప్రాంతాల్లో భూముల బదలాయింపు ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారితే... ఇక ప్రాజెక్టు నిర్మాణంపై పూర్తి స్థాయి అంచనాకు ప్రభుత్వం రాలేకపోయింది. హెచ్ఎండీఏ నిధులతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు ... తెలంగాణలో ఇప్పటివరకు ఎక్కడా లేనట్లుగా ట్రాన్సాక్షనల్ అడ్వైజర్లతో(టీఏ) అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో టీఏలను నియమించుకునేందుకు నెల రోజుల కిందట కార్యాచరణ రూపొందించగా, ఇప్పటికీ కనీసం టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. టెండర్లతో ఏజెన్సీలను ఖరారు చేసేందుకు హెచ్ఎండీఏ చురుగ్గానే వ్యవహరించినా... ఏజెన్సీల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో గడువును ఆగస్టు 12 వరకు పొడిగించారు.

డిజైన్లు ఖరారైనా..

దాదాపు 16 కిలోమీటర్ల మేర రెండు ప్రధాన మార్గాల్లో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్లకు సంబంధించి డిజైన్లు ఇప్పటికే ఖరారయ్యాయి. కానీ కార్యారూపంలోకి ప్రాజెక్టులను తీసుకురావడంలో టీఏలు ఇచ్చే సలహాలు ప్రామాణికం. నిర్మాణ ఖర్చులు, నిర్వహణ భారం, ఆర్థిక వనరులు వంటి అంశాలపై ప్రాజెక్టు వ్యయంపై పూర్తి స్పష్టత లేకనే ప్రత్యామ్నాయంగా టీఏలను నియమించుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్యాట్నీ నుంచి తూంకుంట వరకు వెస్ట్ మారేడ్‌పల్లి, కార్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట మీదుగా తూంకుంట వరకు ఉండే 11 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను సమగ్రంగా పరిశీలించేందుకు ఈ టీఏలను ఆశ్రయించగా, ఆ ప్రతిపాదనలు ఇంకా కొలిక్కి రాలేదు.

పనులు మొదలయ్యేదెన్నడూ?

ప్రాజెక్టు ఖర్చు, నిర్మాణ వ్యయం, రెవెన్యూ వంటి విషయాల్లో లోతుగా అధ్యయనం చేసేందుకు సర్కారు ట్రాన్సాక్షనల్ అడ్వైజర్లను నియమించాలని హెచ్ఎండీఏను ఆదేశించింది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు, ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫాం రోడ్డు వరకు నిర్మించనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్లకు ఆర్థికంగా తుది రూపు తీసుకొచ్చేలా సలహాదారులను నియమించుకునేందుకు హెచ్ఎండీఏ టెండర్లను పిలిచింది. కానీ ఏ ఒక్క ఏజెన్సీ కూడా ప్రాజెక్టును అధ్యయనం చేసేందుకు ముందు రాలేదు. దీంతో గడువు ముగియడంతో ఆగస్టు 12 వరకు బిడ్డింగ్‌కు అవకాశం కల్పించారు.

పురోగతి లేదు..

దాదాపు రూ. 3,800 కోట్ల అంచనా వ్యయంతో ఉత్తర తెలంగాణకు రవాణా సదుపాయాలను మెరుగుపరిచే ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు విషయంలో సర్కారు జాప్యం చేస్తోంది. టీఏల పేరిట కాలయాపన చేస్తుందే తప్ప, ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన భూసేకరణ పనులు మొదలు పెట్టలేదు. భూములు కోల్పోతున్న వారికి టీడీఆర్ విధానంలోనే పరిహారం చెల్లించాలని ప్రాథమికంగా అనుకున్నా... రక్షణ శాఖ కోల్పోతున్న భూములకు మాత్రం ఇతర ప్రాంతంలో స్థలాలను కేటాయించాల్సి ఉంటుంది. కనీసం భూ బదలాయింపు ప్రక్రియలోనూ పురోగతి లేదు.

భూ బదలాయింపులో జాప్యం..

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఈ ప్రాజెక్టు నమూనాలు సిద్ధమైనప్పటికీ.. రక్షణ శాఖ భూముల బదలాయింపులో జాప్యం కారణంగా ప్రాజెక్టు ముందు సాగలేదు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టులకు భూములను కేటాయించేందుకు రక్షణ శాఖ ముందుకు రావడంతో... ప్రాజెక్టు పట్టాలెక్కుతుందని భావించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణానికి వివిధ అంశాలపై సమగ్రమైన నివేదికను రూపొందించలేకపోయింది. దీంతో థర్డ్ పార్టీ ఏజెన్సీలను నియమించుకునేలా హెచ్ఎండీఏకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ట్రాన్సాక్షనల్ అడ్వైజరీ కన్సల్టెన్సీలను హెచ్ఎండీఏ ఆశ్రయించింది. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క ఏజెన్సీ కూడా ముందుకు రాలేదు.

అరుంధతి వైద్యశాలలో శనివారం రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఎమ్మెల్యే మర్రి రక్తదానం

మల్కాజిగిరి, ఆగస్టు 10: రక్తదానం చేసి ప్రాణాలను కాపాడుదామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం దుండిగల్‌లోని అరుంధతి దవాఖానలో తలసీమియా వ్యాధిగ్రస్తుల కోసం ఆయన రక్తదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తలసీమియా వ్యాధిగ్రస్తులకు తరచూ రక్తాన్ని ఎక్కించాల్సి ఉంటుందని, రక్తదాతల కొరతతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ప్రమాదాలు జరిగిన వారి ప్రాణాలను కాపాడేందుకు అత్యవసరంగా రక్తాన్ని ఎక్కించాల్సి ఉంటుందన్నారు. మానవతా దృక్పథంతో రక్తదాతలు ముందుకు రావాలని, రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యపరమైన సమస్యలు రావని చెప్పారు.

ఉన్నత శిఖరాలకు 'నైఫర్'

- డాక్టర్ అరుణిశ్ చావ్లా

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర ఫార్మాస్యూటికల్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ డాక్టర్ అరుణిశ్ చావ్లా

బాలానగర్ , ఆగస్టు 10 : నైఫర్ హైదరాబాద్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ బల్క్ డ్రగ్‌కు ఎంపికైందని కేంద్ర ఫార్మాస్యూటికల్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ డాక్టర్ అరుణిశ్ చావ్లా వెల్లడించారు. శనివారం బాలానగర్ పారిశ్రామికవాడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైఫర్) ఆడిటోరియం హాల్‌లో నైఫర్ డైరెక్టర్ శైలేంద్ర సరాఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ డ్రగ్ డిస్కవరీ, డెలివరీ డయగ్నోస్టిక్స్ 2024 సదస్సుకు అరుణిశ్ చావ్లాతో పాటు నైఫర్ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ సత్యనారాయణ, సీఎస్ఐఆర్ -ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నైఫర్ డీన్ నండూరి శ్రీనివాస్ హాజరయ్యారు. అంతర్జాతీయ డ్రగ్ డిస్కవరీ సందర్భంగా నైఫర్ ప్రాంగణంలో మెడిసినల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మాకాలజీ, మెడికల్ డివైసెస్ సహా వివిధ రంగాలకు చెందిన 131 పోస్టర్, 22 మౌఖిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ సదస్సును పురస్కరించుకొని ప్రదర్శనలకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా అరుణిష్ చావ్లా మాట్లాడుతూ ఫార్మారంగంలో తనకంటూ ప్రత్యేకత సాధించుకున్న నైఫర్ హైదరాబాద్ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోనుందన్నారు. నైఫర్ హైదరాబాద్ సంస్థను విస్తరించడం కోసం 160 ఎకరాల స్థలాన్ని కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. రూ. 100 కోట్ల నిధులతో కేంద్ర ప్రభుత్వం బల్క్ డ్రగ్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఆమోద ముద్రవేసిందని పేర్కొన్నారు.

• ట్రాఫిక్.. టార్చర్

శనివారం సాయంత్రం వేళ..బంజారాహిల్స్ రోడ్ నం. 10లో ఒక్కసారిగా భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలోమీటర్‌కు పైగా వెహికిల్స్ నిలిచిపోవడంతో డ్యూటీలు ముగించుకొని ఇంటికి వెళ్తున్న వాహనదారులకు చుక్కలు కనిపించాయి.

• పింక్ సైక్లథాన్

ఆర్మీ వైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ఎంపవర్ ఉమెన్-ఎలివేట్ ఫిట్‌నెస్' థీమ్‌తో శనివారం పింక్ సైక్లథాన్ జరిగింది. అంబేద్కర్ విగ్రహం నుంచి సంజీవయ్య పార్కు వరకు సాగిన సైక్లింగ్ రైడ్‌లో సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు. - సిటీబ్యూరో

ఆక్రమణలపై హైడ్రా కొరడా

చెరువుల్లో వెలిసిన కట్టడాల కూల్చివేత
20 ప్రహరీలు, ఆరు నిర్మాణాలు నేలమట్టం
స్థిరాస్తులు కొనేముందు హైడ్రాను సంప్రదించాలి: కమిషనర్ రంగనాథ్

చెరువు బఫర్‌జోన్‌లో కూల్చివేసిన అక్రమ నిర్మాణం

సిటీబ్యూరో/బండ్లగూడ, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. గ్రేటర్ పరిధిలో వరుస దాడులతో అక్రమ నిర్మాణాలు, కబ్జాలను తొలగిస్తున్నారు. శనివారం సైతం రాజేంద్రనగర్ సర్కిల్‌లోని బూమ్రుఖుద్దీన్ దవాళ్ చెరువు, చందానగర్ ప్రాంతంలోని ఎర్ర చెరువు బఫర్ జోన్లలో నిర్మించిన అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. దాదాపు 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బూమ్రుఖుద్దీన్ దవాళ్ చెరువులో అధికారుల నిర్లక్ష్యంతో బఫర్ జోన్లలో నిర్మాణాలు జోరందుకున్నాయి. దాదాపు 10 ఎకరాల చెరువు భూమిని కబ్జా చేసినట్లు గుర్తించారు. రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు.. మొత్తం 20 ప్రహరీలు, 6 నిర్మాణాలను పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబిన్ కూల్చివేతలను నిలిపివేయాలని హైడ్రా సిబ్బందిని అడ్డుకోగా, పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు

గ్రేటర్ సిటీ పరిధిలో చెరువులకు సంబంధించిన బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్ పరిధిలో రియల్టర్లు, బిల్డర్ల నిర్మాణాలు అక్రమమని తేలితే చట్టపరంగా కూల్చివేస్తాం. వారికి సహకరించే అధికారులపై కూడా చర్యలుంటాయి. చెరువులు, కుంటల సమీపంలో స్థిరాస్తులను కొనుగోలు చేసే ముందు ఓ సారి హైడ్రా కార్యాలయాన్ని సంప్రదించడం మంచిది.

- రంగనాథ్, హైడ్రా కమిషనర్

273 మంది పోలీస్ సిబ్బంది బదిలీ

సీసీఎస్‌లో భారీ ప్రక్షాళన
కార్ హెడ్ క్వార్టర్స్‌కు 81 మంది అటాచ్
సీపీ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ

సిటీబ్యూరో, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): కమిషనరేట్ పరిధిలో వివిధ స్థాయిలో పనిచేస్తున్న 273 మంది పోలీస్ సిబ్బందిని బదిలీ చేస్తూ..శుక్రవారం రాత్రి సీపీ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు ఇన్‌స్పెక్టర్లను మల్టీజోన్‌కు పంపించగా, అక్కడి నుంచి వచ్చిన వారితో పాటు వెయిటింగ్‌లో ఉన్న కొందరికి పోస్టింగ్‌లు ఇచ్చారు. బదిలీ అయిన వారిలో 51 మంది ఇన్‌స్పెక్టర్లు, 81 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్లకు గతంలో అటాచ్‌మెంట్‌లో ఉన్న మరో 10 సబ్ ఇన్‌స్పెక్టర్లు సైతం ఉన్నారు. 141 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. ప్రత్యేకంగా ఇందులో 22 మందిని సైబర్‌క్రైమ్‌కు, 16 మందిని సీసీఎస్‌కు కేటాయించారు. కాగా, సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్)లో భారీ ప్రక్షాళన చేశారు. 81 మంది సిబ్బందిని ఒకేసారి కార్(సిటీ ఆర్మూడ్ రిజర్వు) విభాగానికి అటాచ్ చేశారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తరువాత పంజాగుట్ట ఠాణాలో ఒకేసారి భారీగా బదిలీలు చేసిన విషయం తెలిసిందే. అదే తరహా సీసీఎస్‌లోనూ తాజాగా బదిలీలు జరిగాయి. కేసుల సెటిల్‌మెంట్లు, అవినీతి ఆరోపణలు రావడంతో చర్యలు తీసుకున్నారు.